1st Year
Happy Work Anniversary.

షణ్ముఖ
SHANMUKHAVELUGU
RNI : APTEL / 2023 / 89152

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక

Good for Health
Best for Readers
THE POWER OF RK PEN

సంపుటి : 3 సంచిక : 122
శుక్రవారం 08 మే 2026 పేజీలు 8 వెల : రూ.3

Printed by Ongole. Published From Ongle, Nellore, Guntur, Markapur, Bapatla.

- రాష్ట్రంలో రోజుకో ఎంఓయూ... వారానికో శంకుస్థాపన
- వేగంగా పనిచేయాలి... అంతే వేగంగా అభివృద్ధి చూపించాలి
- స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్ స్లోగన్‌కే పరిమితం కాకూడదు
- పబ్లిక్ రిలేషన్స్ ఎంత ముఖ్యమో... పబ్లిక్ డెలివరీ అంతే ముఖ్యం
- వినూత్నంగా ఆలోచిస్తే నిధుల కొరతను అధిగమించవచ్చు
- జిల్లా కలెక్టర్ల మధ్య అభివృద్ధిలో పోటీ ఉండాలి
- కాలేజీ రోజుల్లో రాయల్ ఎన్‌ఫీల్డ్ డ్రైవ్ చేశా... ఇప్పుడు ఆ సంస్థను ఏపీకి తెచ్చాం
- 7వ జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్సులో సీఎం చంద్రబాబు దిశా నిర్దేశం

# బెంచ్ మార్క్ సెట్ చేసేలా
# ఏపీ అభివృద్ధి చెందాలి




(షణ్ముఖ వెలుగు, అమరావతి, మే 7)

అభివృద్ధి సహా వివిధ రంగాల్లో బెంచ్ మార్క్ సెట్ చేసేలా రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలిపేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. రెండేళ్ల క్రితం రాష్ట్రం గురించి ఏం మాట్లాడుకునేవారో... ఇప్పుడేం మాట్లాడుకుంటున్నారో ప్రతి ఒక్కరూ గమనించాలని సూచించారు. రాష్ట్రాభివృద్ధికి గ్రామస్థాయి ఉద్యోగులను కూడా మోటివేట్ చేసే బాధ్యతను జిల్లా కలెక్టర్లే తీసుకోవాలని సీఎం దిశా నిర్దేశం చేశారు. రాష్ట్ర సచివాలయంలోని ఐదో బ్లాకులో రెండు రోజులపాటు జరిగే 7వ కలెక్టర్ల కాన్ఫరెన్సు గురువారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."గత పాలకుల నుంచి రూ. 9.74 లక్షల కోట్ల అప్పులు ప్రభుత్వానికి సంక్రమించాయి. 94 కేంద్ర ప్రాయోజిత పథకాల నుంచి రూ.10 వేల కోట్లను గత ప్రభుత్వం డైవర్ట్ చేసింది. రూ.1.30 లక్షల కోట్ల బిల్లులు కూడా గత పాలకులు మనపై రుద్దారు. గత పాలకుల నిర్వాకం వల్ల రాష్ట్రం గుంతలు పడిన రోడ్లతో విధ్వంసమైంది. అందరి సహకారంతో అలాంటి పరిస్థితి నుంచి గట్టెక్కి... వ్యవస్థలను గాడిలో పెట్టగలిగాం. ప్రజా ప్రతినిధులు-అధికారుల కలయికే ప్రభుత్వం. ప్రజాస్వా మ్యంలో సంక్షేమం ప్రభుత్వాల బాధ్యత. ఇప్పుడు సంక్షేమాన్ని, అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నాం. జీవన ప్రమాణాలు పెంచేలా పాలన సాగిస్తున్నాం. వివిధ పాలసీలతో పెట్టుబడులను ఆకర్షిస్తున్నాం. ప్రజల సంతృప్తి స్థాయిని కొలమానంగా పెట్టుకుని పాలన అందిస్తున్నాం."అని ముఖ్యమంత్రి చెప్పారు.

**డబ్ల్యూ డి డబ్ల్యు సి..... ఇదో సైకిల్ :** "అధికారులు క్షేత్రస్థాయిలో బాగా పనిచేసిన చోట ప్రజల నుంచి పాజిటివ్ ఫీడ్ బ్యాక్ వస్తోంది. మంత్రుల నుంచి క్షేత్రస్థాయిలో ఉన్న ప్రజాప్రతినిధి, ఉద్యోగి వరకూ అంతా బాధ్యతగా ఉండాలి. వచ్చిన ఫిర్యాదులు వందశాతం పరిష్కారం కావాల్సిందే. ఆర్థికేతర ఫిర్యాదులను పరిష్కరించకుండా.. కొందరు పైకి కిందకు ఫైళ్లు తిప్పుతున్నారు... వాటిని తక్షణం పరిష్కరించాలి. ఆర్థికపరమైన ఫిర్యాదుల గురించి కూడా విచారణ చేసి సరైన వాటిని పరిష్కరించాలి. 2027 మార్చి నాటికల్లా రెవెన్యూ రికార్డులను పూర్తిగా ప్రక్షాళన కావాలి. సమస్య పరిష్కారం కోసం వినూత్నంగా ఆలోచనలు చేస్తే సుపరిపాలన అందించినట్టే. డబ్బులు లేవనడం కాదు...



2

## ఇక విద్యా శాఖ మొత్తానికీ ఒకే డ్యాష్‌బోర్డు

- మంత్రి నారా లోకేష్.కీలక ప్రకటన
- పాఠశాల, ఇంటర్, ఉన్నత విద్యను ఒకే గొడుగు కిందకు తెచ్చే ప్రయత్నం
- హాజరు, డ్రాపవుట్లు, మధ్యాహ్న భోజనం వివరాలు డ్యాష్‌బోర్డులో అందుబాటు
- త్వరలో ప్రజలకు సైతం ఈ డ్యాష్‌బోర్డును అందుబాటులోకి తెస్తామని స్పష్టీకరణ
- ఉత్తమ విధానాలకు కలెక్టర్లను మెంటార్లుగా నియమిస్తామన్న సీఎం చంద్రబాబు

(షణ్ముఖ వెలుగు, అమరావతి,మే 07)

రాష్ట్ర విద్యాశాఖ మొత్తాన్ని ఒకే గొడుగు కిందకు తీసుకొస్తూ, ఒకే డ్యాష్‌బోర్డును రూపొందించ బోతున్నట్టు ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కీలక ప్రకటన చేశారు. పాఠశాల విద్య నుంచి ఉన్నత విద్య వరకు అన్ని విభాగాల పనితీరును దీని ద్వారా పర్యవేక్షించనున్నట్టు తెలిపారు. అమరావతి సచివాలయంలో జరుగుతున్న 7వ జిల్లా కలెక్టర్ల సమావేశంలో ఆయన ఈ విషయం వెల్లడించారు.ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ.. "విద్యాశాఖకు సంబంధించి ఒక సమగ్రమైన కేపీఐ (కీ పర్ఫార్మెన్స్ ఇండికేటర్)



2

## 'సిందూర్'.. ఉగ్రమూకలకు గుణపాఠం: మోదీ పోస్ట్




(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, మే 07)

ఉగ్రవాదంపై భారత్ కఠిన వైఖరిని, దేశ భద్రతను పరిరక్షించడంలో మన నిబద్ధతను 'ఆపరేషన్ సిందూర్' ప్రతిబింబించిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. 'ఆపరేషన్ సిందూర్ 'కు ఏడాది పూర్తయిన వేళ ప్రధాని 'ఎక్స్' వేదికగా పోస్ట్ పెట్టారు. ఉగ్రవాదాన్ని అణచివేసేందుకు దృఢంగా నిలబడతామని ఈ సందర్భంగా మోదీ పునరుద్ఘాటించారు."సరిగ్గా ఏడాది క్రితం మన సాయుధ దళాలు అసమాన ధైర్యం, అంతులేని సంకల్పం, అత్యంత కచ్చితత్వంతో 'ఆపరేషన్ సిందూర్' చేపట్టాయి. పహల్గాంలో అమాయక భారతీయుల ప్రాణాలను బలితీసుకున్న ఉగ్రమూకలకు గట్టిగా గుణపాఠం చెప్పాయి. మన సైన్యం చూపిన శౌర్య పరాక్రమాలకు యావత్ భారతావని గర్విస్తోంది. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా మన కఠిన వైఖరిని ఈ ఆపరేషన్ ప్రతిబింబించింది. దేశ భద్రతను పరిరక్షించుకోవడంలో మన దళాల నిబద్ధత, మిగతా 2లో

## పిఠాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌ను తప్పించిన తెదేపా అధిష్ఠానం

(షణ్ముఖ వెలుగు, అమరావతి,మే 07)

పిఠాపురం నియోజకవర్గంలో చోటుచేసుకుంటున్న వరుస వివాదాలకు సంబంధించి తెదేపా అధినేత చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నారు. తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఉన్న ఎస్‌వీఎస్‌ఎన్ వర్మను తప్పించారు. అక్కడ పార్టీ వ్యవహారాల కోసం వీలైనంత త్వరగా ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని



2

## విధులకు గైర్హాజరవుతున్న 51 మంది వైద్యుల తొలగింపు

(షణ్ముఖ వెలుగు, అమరావతి,మే 07)

అనధికారికంగా విధులకు గైర్హాజరవుతున్న డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) పరిధిలోని 51 మంది వైద్యులను విధుల నుంచి శాశ్వతంగా తొలగించినట్లు రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. తొలగించిన వారిలో 8 మంది అసోసియేట్ ప్రొఫెసర్లు, 41 మంది సహాయ ప్రొఫెసర్లు, ఇద్దరు ట్యూటర్లు ఉన్నారని పేర్కొన్నారు. ఆరేళ్ల నుంచి విధులకు దూరంగా ఉన్న వారూ వీరిలో ఉన్నారని, ఏపీ సివిల్ సర్వీసెస్ రూల్స్‌ను అనుసరించి వైద్యులను తొలగించినట్లు వెల్లడించారు. ఏడాదికి మించి విధులకు హాజరుకాని వారిని రాజీనామా చేసినట్లుగా భావించి,




2

## ఆలయాల అభివృద్ధికి పరిపాలనా అనుమతులు: మంత్రి దుర్గేశ్

(షణ్ముఖ వెలుగు, అమరావతి,మే 07)

ధర్మ పరిరక్షణే ధ్యేయంగా నిడదవోలు నియోజకవర్గంలోని పుణ్యక్షేత్రాలకు మహర్దశ పట్టనుంది. రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ ప్రత్యేక కృషితో నియోజకవర్గంలోని పలు దేవాలయాల అభివృద్ధికి పరిపాలనా అనుమతులు మంజూరయ్యాయి. భగవంతుని సేవలో భాగంగా తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలోని శ్రీవాణి ట్రస్ట్ నిధులతో ఎస్సీ/ఎస్టీ/బీసీ కాలనీల్లో భజన మందిరాల నిర్మాణానికి అనుమతులు లభించాయి. ఈ సందర్భంగా మంత్రి దుర్గేశ్ గురువారం నిడదవోలులో విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు.



అందులో భాగంగా పెరవలి మండలం నడుపల్లి గ్రామంలోని బీసీ కాలనీలో ఉన్న శ్రీ దుర్గా మాత దేవాలయానికి 5 సెంట్ల స్థలం, రూ.10 లక్షలు, పెరవలి మండలం మల్లేశ్వరం గ్రామంలోని బీసీ కాలనీలో ఉన్న శ్రీ వినాయక స్వామి ఆలయానికి 10 సెంట్ల స్థలం, రూ.20 లక్షలు, ఉండ్రాజవరం మండలంలోని పాలంగి గ్రామంలో బీసీ కాలనీలోని శ్రీ కొండాలమ్మ అమ్మవారి దేవాలయానికి 11 సెంట్ల స్థలం, రూ.20 లక్షల నిధులు కేటాయిస్తూ దేవాదాయశాఖ పరిపాలనా అనుమతులు మంజూరైనట్లు తెలిపారు. మిగతా 2లో



## తిరుమల లడ్డు వ్యవహారంపై ఏపీ సర్కారు కీలక నిర్ణయం

- లడ్డూలో కల్తీ నెయ్యి అంశంపై ఇప్పటికే విచారణ జరిపిన ఏక సభ్య కమిటీ
- ఈ కమిటీ నివేదికను అధ్యయనం చేసేందుకు హైలెవెల్ కమిటీని నియమించిన ప్రభుత్వం
- వారంలోగా నివేదిక సమర్పించాలని ఉన్నత స్థాయి కమిటీకి ఆదేశం

(షణ్ముఖ వెలుగు, అమరావతి,మే 07)

తిరుమల లడ్డూ తయారీలో నాణ్యతతో పాటు ఇతర వివాదస్పద అంశాలపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే ఈ వ్యవహారంపై విచారణ జరిపిన ఏక సభ్య కమిటీ నివేదికను లోతుగా అధ్యయనం చేసేందుకు ముగ్గురు సభ్యులతో కూడిన హై లెవెల్ కమిటీని ప్రభుత్వం నియమించింది. ఈ కమిటీకి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఛైర్మన్‌గా వ్యవహరిస్తుండగా, డీజీపీ, న్యాయ శాఖ కార్యదర్శి సభ్యులుగా ఉన్నారు. నివేదికలోని సాంకేతిక, పరిపాలనాపరమైన, న్యాయపరమైన అంశాలను సమగ్రంగా సమీక్షించి, బాధ్యులపై తీసుకోవాల్సిన చర్యలపై ఈ కమిటీ మార్గదర్శకాలను రూపొందించనుంది.ఈ అత్యున్నత స్థాయి కమిటీ మిగతా 2లో

## గ్రంథాలయంలో ఖోఖో పోటీలు





(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, మే 7)

మండల కేంద్రమైన ఉలవపాడు శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా గురువారం విద్యార్థులతో ముందుగా వివిధ రకాల విజ్ఞానదాయకమైన పుస్తకాలు చదివించి అనంతరం పిల్లల మానసిక ఆనందం కోసం ఖోఖో పోటీలు నిర్వహించారు. గురువారం గ్రంథాలయానికి విచ్చేసిన ఉలవపాడు గ్రామ నివాసి రిటైర్డ్ ఈఓ ఎన్‌టి రామ్ కుమార్ పిల్లలకు శీతల పానీయాలు, స్నాక్స్ అందించి వారి ప్రేమకు పాత్రులయ్యారు. ఈ సందర్భంగా గ్రంథపాలకుడు వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమానికి మొత్తం 35 మంది విద్యార్థులు హాజరైనట్లు గ్రంథాలయ పాలకుడు డి కోటేశ్వరరావు తెలియజేశారు.

## ఒంగోలు ఆర్డీఓగా టి చంద్రశేఖర్ నాయుడు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 7)

ఒంగోలు ఆర్డిఓగా టి చంద్రశేఖర్ నాయుడు గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారిని ఆమె ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రజల సమస్యల పరిష్కారానికే సదస్సులు

(షణ్ముఖ వెలుగు, పొదిలి, మే 7)




ప్రజల సమస్యలను మరింత వేగంగా పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఒక నెల-ఒక గ్రామం-నాలుగు సందర్శనల పేరుతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఈగలపాడు గ్రామంలో సదస్సు తహశీల్దార్ ఎం వి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రజలు నలుగురు తమకున్న రెవెన్యూ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలకు పరిష్కారం చూపుతామని అధికారులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఎం వి కృష్ణారెడ్డి, ఎంపిడిఓ శ్రీనివాసరావు, ఎంఆర్ఐ నరసింహారావు, ఎండోమెంట్ అధికారి పచ్చువ రామకృష్ణ, విఆర్ఓ బాల వెంకటరెడ్డి, మండల సర్వేయర్ గురవయ్య, ఇతర రెవిన్యూ అధికారులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

## బెంచ్ మార్క్ సెట్ చేసేలా ఏపీ అభివృద్ధి చెందాలి

సంపద సృష్టికి పని చేయాలి... చేద్దాం. వెల్ఫేర్, డెవలప్మెంట్, వెల్త్ క్రియేషన్ అనేది ఓ సైకిల్. అభివృద్ధి లేకుండా సంపద లేదు. సంపద లేకుండా సంక్షేమం లేదు. సూపర్ సిక్స్ పథకాలతో భద్రత, భరోసా కల్పించాం. పీ4తో ఆర్థిక ప్రమాణాలు పెంచుతున్నాం. 26 కొత్త పాలసీలతో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఏపీ అంటే నమ్మకాన్ని కల్పించాం. రాయల్ ఎన్ ఫీల్డ్ వాహనాన్ని డ్రైవ్ చేయడమనేది గర్వంగా ఉండేది. కాలేజీ రోజుల్లో ఎన్ ఫీల్డ్ డ్రైవ్ చేయడాన్ని గొప్పగా ఫీలయ్యేవాళ్లం. అలాంటి రాయల్ ఎన్ ఫీల్డ్ సంస్థను ఏపీకి తెచ్చాం. రూ. 23 లక్షల కోట్ల ఎంఓయూలు చేసుకున్నాం. ఇవి సాకారమైతే 24 లక్షల మేర ఉద్యోగాలు వస్తాయి. గ్రీన్ ఎనర్జీతో పాటు గ్రీన్ హైడ్రోజన్, అమ్మోనియా ఉత్పత్తి దిశగా ముందుకు వెళ్తున్నాం. డేటా, ఏఐ, క్వాంటం లాంటి టెక్నాలజీలకు ఏపీ కేంద్రంగా మారనుంది. గూగుల్, ఆర్సెలార్ మిట్టల్ లాంటి దిగ్గజ కంపెనీలు ఏపీకి వచ్చాయి. రోజుకో ఒప్పందం, వారానికో శంకుస్థాపన చేసుకోగలుగుతున్నాం. వేసవిలో దేశ ప్రజలను చల్లబరిచే ఏసీలు మన రాష్ట్రం నుంచే సరఫరా చేసే పరిస్థితికి వచ్చాం."అని సీఎం వివరించారు.

**బెస్ట్ ప్రాక్టీసెస్ అమలు చేసే కలెక్టర్లే నోడల్ ఆఫీసర్లు**

"గత ప్రభుత్వం అనవసరంగా ప్రైవేటు భూములను నిషేధిత జాబితాలో పెట్టేసింది. కార్యాలయాల చుట్టూ తిరిగి ప్రజలు విసిగిపోతున్న పరిస్థితి ఉంది. భూముల విషయంలో జీరో ఎర్రర్ రికార్డులు తయారు చేయాలి. రోడ్లు, వంతెనలు, ఎత్తిపోతల ప్రాజెక్టులు పూర్తి చేసి ప్రజల ఆకాంక్షలు నెరవేర్చాలి. ప్రతీ మూడు నెలలకూ నిర్వహించే కలెక్టర్ల సదస్సు మంత్రులు, అధికారులకు క్వార్టర్లీ పరీక్షలు. ప్రజల కోసం పనిచేసే వ్యక్తులు ఎవరికీ భయపడాల్సిన అవసరమే లేదు. పబ్లిక్ రిలేషన్స్ ఎంతో ముఖ్యమో... పబ్లిక్ డెలివరీ కూడా అంతే ముఖ్యం. లాస్ట్ మైల్ లో ఉండే ఉద్యోగిని కూడా మోటివేట్ చేస్తే అద్భుతంగా పని చేయగలరు. విద్యుత్ రంగంలో సంస్కరణలు తెచ్చి 0.30 పైసల మేర కొనుగోలు వ్యయం తగ్గించాం. మరో 0.30 పైసలు త్వరలోనే తగ్గిస్తాం... తొలిసారి ట్రూ డౌన్ చేయగలిగాం. గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కల్పించాం... ఆన్ లైన్ లో పన్నులు కట్టారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన పదో తరగతి టాపర్ల ఫోటోలతో యాడ్ ఇచ్చాం. ప్రైవేటు స్కూళ్లకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయని చాటి చెప్పాం. డిమాండ్ డ్రివెన్ అగ్రికల్చర్, ఆక్వా కల్చర్ దిశగా అడుగులు వేస్తున్నాం. అన్ని రంగాల్లో... అన్ని వ్యవస్థల్లో ఏపీ పనితీరు బెంచ్ మార్క్ గా మారాలి. జిల్లాలు, కలెక్టర్ల మధ్య అభివృద్ధిలో పోటీ ఉండాలి. జిల్లాల్లో అమలు చేసే ఉత్తమ పద్ధతులను బెస్ట్ ప్రాక్టీసెస్ మిగతా జిల్లాల్లోనూ అమలు చేస్తాం... ఆ కలెక్టర్లనే వాటికి నోడల్ ఆఫీసరుగా పెడతాం. సీయింగ్ ఇజ్ బిలీఫ్ అనే విధానంలో 3 రోజుల కార్యదర్శులు, 6 రోజులు హెచ్వోడీలు, 8 రోజులు కలెక్టర్లు ఫీల్డ్ కు వెళ్లాలి. సామాజిక మాధ్యమాలను సక్రమంగా వినియోగించుకోవాలి. రిజల్ట్ ఓరియేంటేషనుతో ప్రతి ఒక్కరూ పని చేయాలి. ఆఫీస్ టెల్స్ యూ డేటా... ఫీల్డ్ టెల్స్ యూ ట్రూత్.. దీన్ని గుర్తు పెట్టుకోవాలి. స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్ ఈజ్ నాట్ స్లోగన్... గవర్నెన్స్ డిసైడ్స్ ద స్పీడ్ ఆఫ్ గ్రోత్. ఫైల్స్ షుడ్ నాట్ మూవ్... రిజల్ట్స్ షుడ్ మూవ్.. అప్పుడే ప్రజలకు మంచి సేవలు అందుతాయి."అని ముఖ్యమంత్రి దిశా నిర్దేశం చేశారు. 7వ కలెక్టర్ల కాన్ఫరెన్సులో మంత్రులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లు పాల్గొన్నారు.

(ఎన్ వి ఎస్ వి ప్రసాద్)

## ఇక విద్యా శాఖ మొత్తానికీ ఒకే డ్యాష్‌బోర్డు

డ్యాష్‌బోర్డును రూపొందించాం. విద్యార్థుల హాజరు, డ్రాపవుట్లు, మధ్యాహ్న భోజనం వంటి కీలక అంశాలను ఇందులో పొందుపరిచాం. నిర్దేశిత లక్ష్యాలను సాధించడంలో ఈ డ్యాష్‌బోర్డు కలెక్టర్లకు ఎంతగానో ఉపయోగపడుతుంది" అని వివరించారు. 'డెమాక్రటైజేషన్ ఆఫ్ డేటా' తమ లక్ష్యమని, త్వరలోనే ఈ డ్యాష్‌బోర్డును ప్రజలకు కూడా అందుబాటులోకి తీసుకువస్తామని స్పష్టం చేశారు.

ఇదే సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. ఉత్తమ విధానాలు (బెస్ట్ ప్రాక్టీసెస్) అమలు చేసేందుకు జిల్లాల కలెక్టర్లను మెంటార్లుగా నియమిస్తామని ప్రకటించారు. ఇందులో భాగంగా, స్కూళ్లలో స్మార్ట్ కిచెన్ల ఏర్పాటుకు మెంటార్‌గా కడప జిల్లా కలెక్టర్ శ్రీధర్‌ను నియమిస్తున్నట్టు తెలిపారు. పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం పెంచేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ నిర్ణయాలు స్పష్టం చేస్తున్నాయి.

## ఆలయాల అభివృద్ధికి పరిపాలనా అనుమతులు: మంత్రి దుర్గేశ్

రానున్న గోదావరి పుష్కరాల నాటికి పుణ్యక్షేత్రాలన్నింటినీ సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది, భక్తులకు సకల సౌకర్యాలు కల్పించడమే తమ ప్రథమ కర్తవ్యమని మంత్రి పేర్కొన్నారు. ఈ పుణ్య కార్యానికి సహకరించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిలకు మంత్రి కందుల దుర్గేశ్ కృతజ్ఞతలు తెలిపారు. నిర్ణీత కాల వ్యవధిలోగా, ఆగమ శాస్త్ర నియమాల ప్రకారం అత్యున్నత నాణ్యతతో ఈ నిర్మాణాలను పూర్తి చేసి భక్తులకు అంకితం చేస్తామని మంత్రి వెల్లడించారు.

## పిఠాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌ను తప్పించిన తెదేపా అధిష్ఠానం

నిర్ణయించారు. ఈ మేరకు పార్టీ కసరత్తు ప్రారంభించింది.

**పార్టీ ఏ నిర్ణయం తీసుకున్నా సహకరిస్తా: వర్మ**

తెలుగుదేశం పార్టీ ఏ నిర్ణయం తీసుకున్నా పూర్తిగా సహకరిస్తానని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ తెలిపారు. పిఠాపురం నియోజకవర్గంలో పార్టీ వ్యవహారాల కోసం వీలైనంత త్వరగా ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలన్న అధిష్టానం నిర్ణయంపై వర్మ స్పందించారు. "రకరకాల సమీకరణలతో మార్పులు జరుగుతుంటాయి. ఫైనల్‌గా పార్టీ బాగుండాలనేదే చూడాలి. మంత్రి నారా లోకేశ్‌తో మాట్లాడిన తర్వాతే పిఠాపురం తెదేపాలో నూతన కమిటీ ఏర్పాటు నిర్ణయం జరిగింది. పార్టీలో నాయకులే ఇక్కడ నిర్వహణ చూస్తారు. పార్టీ ఏ నిర్ణయం తీసుకున్నా దానికి నేను పూర్తిగా సహకరిస్తా" అని వర్మ తెలిపారు.

## విధులకు గైర్హాజరవుతున్న 51 మంది వైద్యుల తొలగింపు

చర్యలు తీసుకునే అధికారం ప్రభుత్వానికి ఉందని, అయినా సంజాయిషీ నోటీసులు జారీ చేసి, తగిన సమయం ఇచ్చామని చెప్పారు. నోటీసులకు స్పందన లేనందున 51 మందిని విధుల నుంచి తప్పించినట్లు వివరించారు.

## తిరుమల లడ్డు వ్యవహారంపై ఏపీ సర్కారు కీలక నిర్ణయం

తన నివేదికను వారంలోగా ప్రభుత్వానికి సమర్పించాలని ఆదేశాలు అందాయి. లడ్డూ తయారీలో నిబంధనల ఉల్లంఘన ఎక్కడ జరిగింది, అందుకు గల కారణాలను విశ్లేషించి, దోషులపై కఠిన చర్యలు తీసుకోవడమే ఈ కమిటీ ప్రధాన లక్ష్యం.

## 'సిందూర్'.. ఉగ్రమూకలకు గుణపాఠం: మోదీ పోస్ట్

సంసిద్ధత, సమర్థత, సంకల్ప బలాన్ని చాటిచెప్పింది. రక్షణరంగంలో స్వావలంబన కోసం మనం చేపట్టిన ప్రయత్నాలు ఫలించి.. జాతి భద్రతకు అదనపు బలాన్ని చేకూర్చాయని 'సింధూర్'తో స్పష్టమైంది. ఉగ్రవాదులు, వారికి మద్దతిచ్చే వారిపై ఉక్కుపాదం మోపుతూనే ఉంటాం" అని మోదీ తన పోస్ట్‌లో రాసుకొచ్చారు.

**'సింధూర్'కు కొత్త లోగో..**

ఇదిలాఉండగా.. ఆపరేషన్ సిందూర్‌లో మన విజయానికి గుర్తుగా కేంద్రం కొత్త లోగోను రూపొందించింది. గతేడాది ఆపరేషన్ సమయంలో విడుదల చేసిన 'సిందూర్' లోగో పైన సగర్వంగా రెపరెపలాడుతున్న మన మువ్వన్నెల పతాకాన్ని జోడించింది. ఈ ఫొటోను ప్రధాని మోదీతో పాటు పలువురు కేంద్ర మంత్రులు, రాజకీయ ప్రముఖులు తమ సోషల్ మీడియా ఖాతాలకు డీపీగా పెట్టుకున్నారు.

# ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మొట్టమొదటి దళిత

## ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్యకు ఘన నివాళి

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 7)

ఆంధ్రప్రదేశ్ మొట్టమొదటి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జీవితం ఇప్పటికీ ఎప్పటికీ ఆదర్శనీయమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు శ్రీపతి ప్రకాశం అన్నారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య వర్ధంతిని పురస్కరించుకొని జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందున్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అనేక సంస్కరణలకు నాంది పలికిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. మొదటిసారిగా పెన్షన్ ప్రవేశపెట్టి ఆరు లక్షలకు పైగా బంజరు భూములను పేదలకు పంచిన మానవతావాది అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షునిగానే కాక అనేక పదవులను అలంకరించి ఆ పదవులకే వన్నెతెచ్చిన మంచి వ్యక్తి అని కొనియాడారు. అటువంటి మహనీయుని జీవితాన్ని ప్రతి ఒక్కరు స్ఫూర్తిగా తీసుకొని ఎదగాలని కోరారు. పాఠ్యాంశాలలో ఆయన జీవితాన్ని ముద్రించి భావితరాలకు సమాజానికి ఎలా ఉపయోగపడాలో తెలియజేసే విధంగా ప్రభుత్వాలు నిర్ణయాలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దామోదరం సంజీవయ్య కమిటీ చైర్మన్ యాదాల అరుణ్ కుమార్ (బుజ్జి), సంతనూతలపాడు మాజీ సర్పంచి రంప తోటి అంకారావు, ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ మెంబర్ కాకి కృపారావు, ప్రొఫెసర్ హర్ష ప్రీతం, విశ్రాంత సబ్ కలెక్టర్ కత్తి పేరయ్య, కొండేపి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి శ్రీపతి సతీష్, లెమ్యూల్ రాజు, వి సుందర రావు, కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు ఆదినారాయణ రెడ్డి, షేక్ రసూల్, తదితరులు పాల్గొన్నారు.







షణ్ముఖ

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు    తెలుగు దినపత్రిక

08.05.26    శుక్రవారం


# గ్రామాల్లో ఉన్న ప్రతి రెవిన్యూ సమస్యను పరిష్కరిస్తాం

## మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి






(షణ్ముఖ వెలుగు, మార్కాపురం, కొనకనమిట్ల, మే 7)

గ్రామాల్లో ఉన్న ప్రతి రెవిన్యూ సమస్యను పరిష్కరించడమే లక్ష్యంగా "ఒక నెల-ఒక ఊరు-నాలుగు పర్యటనలు" పేరుతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న " ఒక నెల- ఒక ఊరు- నాలుగు పర్యటనలు" లో భాగంగా గురువారం మార్కాపురం మండలంలోని రామచంద్రాపురం, కొనకనమిట్ల మండలంలోని మంగాపురం గ్రామాల్లో రైతు సదస్సులు నిర్వహించారు. ఈ సదస్సులకు ముఖ్య అతిథిగా హాజరైన మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ముందుగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ "ఒక నెల- ఒక ఊరు - నాలుగు పర్యటనలు" కార్యక్రమాన్ని ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందన్నారు.

దీని ద్వారా నెలకు ఒక గ్రామంలో (ప్రతి గురువారం) నాలుగు వారాలు రెవెన్యూ అధికారులు పర్యటిస్తారని దీని ద్వారా జీరో ఖాతా భూములు, ఇతరులు, పొలం గట్ల సమస్యలు తదితర ప్రతి రెవెన్యూ సమస్యకు నెల కాలంలో అధికారులు పరిష్కరిస్తారన్నారు. ప్రతి ఒక్కరూ ఏ రెవెన్యూ సమస్య ఉన్న అధికారులకు అర్జీల రూపంలో అందజేయాలన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో వైసిపి నాయకులు తమకు అనుకూలంగా ఉన్న వారికి మిగతా వారి భూములు ఆన్‌లైన్ చేసి ప్రజలను మోసం చేశారన్నారు. అటువంటి తప్పులు మన ప్రభుత్వ హయాంలో జరగవన్నారు. పైగా ఆ సమస్యలకు ఈ కార్యక్రమం ద్వారా పరిష్కారం చూపిస్తామన్నారు. గత వైసిపి పాలన మొత్తం కక్ష సాధింపులతోనే కాలం వెళ్ళబుచ్చారని, అలాకాకుండా మన కూటమి ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి ఫలాలను కూడా అందజేస్తున్నామన్నారు. ఇప్పటికే నిరుద్యోగులకు రాష్ట్రంలో 6 లక్షల 40 వేల ఉద్యోగాలు ఇచ్చామని, భవిష్యత్తులో మరిన్ని ఉద్యోగాలు యువతకు లభిస్తాయన్నారు. వెనుకబడిన మన ప్రాంతాన్ని అభివృద్ధి చేయడానికి ఇప్పటికే మార్కాపురం జిల్లా ప్రకటించారని, త్వరలోనే వెలుగొండ ప్రాజెక్టు పూర్తి చేస్తామన్నారు. తద్వారా ఈ ప్రాంతాన్ని హార్టికల్చర్ హబ్‌గా మారుస్తామని అన్నారు. త్వరలోనే కొత్త పెన్షన్ల మంజూరు కార్యక్రమం ఉంటుందన్నారు. (తరువాయి 4లో...)

# గిట్టుబాటు ధర తగ్గించడం పై రైతుల ఆందోళన

## అధికారులు, వ్యాపారుల నిర్లక్ష్యం పై రాస్తా రాకో

(షణ్ముఖ వెలుగు, పొదిలి, మే 7)





పొదిలి పట్టణంలో పొగాకు రైతులు ఒక్కసారిగా ఆందోళనకు దిగారు. గత 45 రోజులుగా సాగుతున్న పొగాకు వేలంలో రైతుల సంబంధించి కొను గోలులో మందగమనం పై తీవ్ర అగ్రహం వ్యక్తం చేస్తూ వేలాన్ని బహిష్క రించి తాళాలు వేశారు. వివరాల్లోకి వెళితే పొదిలిలో పొగాకు వేలం సందర్భంగా గురువారం కొనకనమిట్ల మండల పరిధిలోని వాగుమడుగు క్లస్టర్‌లో వాగుమడుగు, కాట్రగుంట, అంబాపురం, తువ్వ పాడు, తదితర గ్రామాల రైతులు పొగాకు బేళ్లు అమ్మకానికి తీసుకొచ్చారు. క్లస్టర్‌కు సుమారు 1000, 1100 బేళ్ళు అమ్మకానికి పెట్టాల్సి ఉండగా గురువారం కేవలం 400 బేళ్లు మాత్రమే అనుమతించారు. అయితే కొనుగోలులో వ్యాపారులు ప్రతి 20 బేళ్లకు ఒకటి మాత్రమే కొనుగోలు చేస్తూ ఎక్కడికి అక్కడ నోబిడ్‌లో వదిలేసి వెళుతున్నారు. మార్చి 25న ప్రారంభమైన పొగాకు వేలం గత 45 రోజులుగా వ్యాపారులు కేవలం మొక్కుబడిగా ఒకటి రెండు వేలు కొనుగోలు చేసి మిగతావి వదిలేస్తూండడంతో రైతుల్లో రోజు రోజుకు అసహనం పెరిగిపోయింది. ఈ విషయం పై అధికారులను, వ్యాపారులను రైతు నిలదీయడంతో వేలానికి వచ్చిన బేళ్లలో తాము 10% మాత్రమే కొనుగోలు చేస్తామని తెలిపారన్నారు. ఇలా కొనుగోలు చేస్తే తాము తెచ్చిన బేళ్లు వెనక్కి తీసుకుపోవడం మరలా రావడం వృధా ప్రయాసతో కూడిన ఆర్థిక భారం అవుతుందని రైతులు విన్నవించారు. అయినప్పటికీ రైతుల తెచ్చిన బేళ్లను మొత్తం కొనుగోలు చేసేందుకు వ్యాపారులు, అధికారులు సుముఖత వ్యక్తం చేయకపోగా రేపటి నుంచి ఇంకా బేళ్లను తగ్గిస్తామని ప్రకటించడంతో రైతులు ఒకసారిగా ఆందోళనతో వీళ్ళని బహిష్కరించారు. గురువారం వేలంలో పొగాకు ధర కేజీ రూ.20 చేయడంతో రైతుల్లో తీవ్ర అసహనం పెరిగింది. దీనికి తోడు తెచ్చిన బేళ్లను కొనుగోలు చేయకుండా ప్రతి 20లో ఒకటి మాత్రమే కొంటూ మిగిలినవి వదిలేస్తు నోబిడ్ చేస్తూ ఉండడంతో రైతులు అసహనంతో వేలం నిలిపివేశారు. వేలంలో ఐటిసి కంపెనీ మాత్రమే పాల్గొంటూ మిగిలినవి ఏవి పోటీకి రాకపోవడంతో కొనుగోలు మందగించడం, నాణ్యత ఉన్న బేళ్లను సైతం కొనుగోలు చేయకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరుగాలం కష్టపడి పొగాకు సాగు చేసి లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టి తీసుకొచ్చిన బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేయకుండా వెనక్కి పంపుతూ ఉండడం, వారికి అధికారులు వంత పాడుతూ (తరువాయి 4లో...)

# విద్యుత్‌షాక్‌తో యువకుడు మృతి



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, మే 7)

మార్కాపురం పట్టణంలోని కంభం రోడ్డులో విషాదకర ఘటన చోటుచేసుకుంది. విద్యుత్ షాక్‌కు గురై ఓ యువకుడు మృతి చెందిన సంఘటన గురువారం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే శివాజీ నగర్‌కు చెందిన తంగిరాల శ్రీనివాసరెడ్డి (25) టెంట్ హౌస్‌లో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. పెళ్లి కార్యక్రమాల కోసం లైటింగ్ పనులు నిర్వహించేందుకు కంభం రోడ్డులోని ఎస్‌ఐసి కార్యాలయం పక్కవీధిలో గల ఓ ఇంటికి వెళ్లాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు 11 కె.వి హైటెన్షన్ విద్యుత్ వైర్లకు తగలడంతో అతడు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న స్థానికులు వెంటనే స్పందించి మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి (జీజీహెచ్)కు తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఇదిలా ఉండగా ట్రాన్స్‌ఫార్మర్ వద్ద తగిన భద్రతా చర్యలు లేకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని స్థానికులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి అవసరమైన భద్రతా చర్యలు చేపట్టి భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

# రాష్ట్ర స్థాయి 7వ జిల్లా కలెక్టర్‌ల సదస్సులో ప్రకాశం, మార్కాపురం జిల్లా కలెక్టర్లు







(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్కాపురం, మే 7)

రాష్ట్ర స్థాయి 7వ జిల్లా కలెక్టర్‌ల సదస్సు అమరావతిలోని సచివాలయంలో గురువారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ప్రకాశం, మార్కాపురం జిల్లా కలెక్టర్లు పి రాజాబాబు, ఎం విజయసునీతలు పాల్గొన్నారు.

# ఆలన లేక పారిపోయిన కొండముచ్చు వెంటాడిన దొరకని వైనం

## మున్సిపాలిటీకి మరోసారి పది వేలు బొక్క

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, మే 7)



మార్కాపురం ద్వితీయ శ్రేణి మున్సిపాలిటీలో కోతుల బెడద అధికంగా ఉండడంతో మున్సిపాలిటీ అధికారులు బెడదను నివారించేందుకు రూ.10వేలు ఖర్చు పెట్టి ఒక కొండముచ్చును కొనుగోలు చేశారు. ఈ కొండముచ్చును పట్టణంలో అధికంగా కోతులు సంచరించే ప్రాంతంలో తిప్పడం ద్వారా కోతులు పారిపోతాయి అనేది మున్సిపల్ అధికారుల ఆలోచన. అయితే ఈ ఆలోచనకు రూపం దాలుస్తూ నంద్యాల జిల్లా ఆత్మకూరు ప్రాంతం నుండి జత కొండముచ్చులను సుమారు రూ.10 వేలకు కొనుగోలు చేశారు. ఈ కొండముచ్చును పట్టణంలోని పురవీధులలో తిప్పేందుకు ఓ వ్యక్తిని నియమించి అతనికి నెల జీతం ఇస్తూ కొండముచ్చు బాగోగులను అప్పగించారు. సదరు వ్యక్తి ప్రతి రోజు ఉదయాన్నే కొండముచ్చును తీసుకొని పట్టణంలోని కోతుల బెడద ఉన్న ప్రాంతాలలో తిరుగుతూ సాయంత్రానికి ఆ కొండముచ్చును మున్సిపాలిటీలో ప్రత్యేకంగా కేటాయించిన బోనులో బంధించేవారు. కొండముచ్చును తిప్పే వ్యక్తి మద్యపాన వ్యసనపరుడు కావడంతో దాని బాగోగులు గాలికి వదిలేసాడు. దీంతో మున్సిపాలిటీ కార్యాలయం ప్రాంతంలో గల మార్కెట్‌లో పళ్ళు విక్రయించేవారు కొన్ని పండ్లను కొండముచ్చుకు ఆహారంగా వేసేవారు. నిత్యం తినే అరటిపండు, యాపిల్, బొప్పాయ, జామ, ఇతరత్రాలు తిని తిని ఎగటు పుట్టి అవి కూడా తినడం మానివేసిన కొండముచ్చు ఆహార పానీయాలను వదిలి బక్క చిక్కిపోయింది. అసలే వేసవికాలం కావడంతో తల్లడిల్లిపోయిన కొండముచ్చు గత నాలుగు రోజుల కిందట బోను నుండి తప్పించుకొని మున్సిపాలిటీ సిబ్బంది కళ్లు గప్పి పారిపోయింది. దానిని పట్టుకునేందుకు సిబ్బందిలో కొందరు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. గతంలో కూడా ఇదే తరహాలో మున్సిపాలిటీ వారు నంద్యాలలో రూ.15 వేలకు కొనుగోలు చేసిన కొండముచ్చు పారిపోయి వార్తలలోకి ఎక్కింది. రెండవ సారి కొనుగోలు చేసిన జత కొండముచ్చులలో ఒకటి కొనుగోలు చేసి తెచ్చిన కొత్తలోనే అనారోగ్యంతో చనిపోగా మరొకటి పారిపోయింది. (తరువాయి 4లో...)

## వృద్ధులకు న్యాయ సహాయం పై అవగాహన



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 7)
జాతీయ న్యాయ సేవాధికార సంస్థ వారు రూపొందించిన పథకాలలో ముఖ్యమైన వృద్ధులకు న్యాయ సహాయం మీద జిల్లా న్యాయ సేవాధిక సంస్థ ,మండల లీగల్ సర్వీసెస్ కమిటీలు విస్తృతంగా వృద్ధుల యొక్క చట్టాలు , వాటి రక్షణ అంశం మీద అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి , సీనియర్ సిటి న్యాయమూర్తి షేక్ ఇబ్రహీం షరీఫ్ ఈరోజు గురువారం ఒంగోలు పట్టణంలోని సమతా మహిళా వృద్ధాశ్రమల సందర్శించి అక్కడ వృద్ధులతో మాట్లాడి వారికి అందుతున్న సదుపాయాల గురించి తెలుసుకున్నారు. వారికి అందవలసిన హక్కులను వారికి తెలియపరచి న్యాయపరమైన సమస్యలు పరిష్కారానికి జిల్లా న్యాయ సేవ అధికార సంస్థను సంప్రదించవచ్చని అన్నారు వృద్ధులకు సంబంధించిన సంరక్షణ ,రక్షణ చట్టం గురించి వారికి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సమతా వృద్ధాశ్రమం నిర్వాహకులు అంకబాబు పాల్గొన్నారు. అనంతరం న్యాయమూర్తి రిమ్స్ ఆవరణలో గల సఖి సెంటర్‌ను, రాంనగర్‌లో గల బాలసదనం సందర్శించారు.

## ఎంపీ మాగుంటను కలిసిన దామచర్ల సత్య



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 7)
ఒంగోలు రామ్‌నగర్‌లోని మాగుంట కార్యాలయంలో ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి ని ఏపి మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు రైల్వే బ్రిడ్జిల గురించి రైల్వే సేఫ్టీ ప్రాజెక్టు ఇంజనీర్ అధికారులు సుందర్ సింగ్, ఏపి మారిటైం బోర్డ్ చైర్మన్ దామచర్ల సత్య పాల్గొన్నారు.

## చాగొల్లు గ్రామంలో గ్రామ సభ





(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, మే 7)
మండలంలోని చాగొల్లు గ్రామ సచివాలయం నందు వన్ మంత్ వన్ విలేజ్ ఫోర్ విజిట్స్ ప్రోగ్రామ్‌లో భాగంగా గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కందుకూరు సబ్ కలెక్టర్ హిమ వంశీ పాల్గొని వచ్చిన అర్జీలను స్వీకరించి నిర్ణీత సమయంలో పరిష్కరిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు ఏవి రవి శంకర్, ఎంపిడిఓ సురేష్, మండల సర్వేయర్ ఖాదర్ హుస్సేన్, విఆర్ఓ రవిబాబు, అందరు మండల స్థాయి అధికారులు, గ్రామ రైతులు, గ్రామ నాయకులు పాల్గొన్నారు. గ్రామ సభలో మొత్తం 7 అర్జీలు వచ్చాయని తహశీల్దార్ ఏవి రవి శంకర్ తెలియజేశారు.

# గ్రామాల్లో ఉన్న ప్రతి రెవిన్యూ సమస్యను పరిష్కరిస్తాం

గత ప్రభుత్వ హయాంలో కక్ష సాధింపులకు పోయి మిగతా పార్టీల వారి పెన్షన్లు తీసేసారని, కానీ మన ప్రభుత్వంలో ఏ ఒక్కరి పెన్షన్ కూడా పోలేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో పాస్ పుస్తకాల పై కూడా జగన్ బొమ్మను ముద్రించి రెవిన్యూ వ్యవస్థను అల్లకల్లోలం చేశారన్నారు. కానీ ఇప్పుడు ప్రభుత్వ రాజముద్రతో నూతన పాస్ పుస్తకాలు మంజూరు చేస్తున్నామన్నారు. అనంతరం మంగాపురం గ్రామంలో మునగపాడు రెవెన్యూ విలేజ్ పరిధిలో మంజూరైన 520 కొత్త పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం తహశీల్దార్ చిరంజీవి, కొనకనమిట్ల తహశీల్దార్ సురేష్, మార్కాపురం, పొదిలి ఏఎంసి ఛైర్మన్‌లు మాలపాటి వెంకట్‌రెడ్డి, డాక్టర్ సయ్యద్ ఇమాంసా, కొనకనమిట్ల మండల పార్టీ అధ్యక్షులు మూరబోయిన బాబురావు యాదవ్, మాజీ మండల పార్టీ అధ్యక్షులు తాతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, ఇతర మండల అధికారులు, ఆయా గ్రామాల ప్రజలు, తెలుగుదేశం పార్టీ









# ఆలన లేక పారిపోయిన కొండముచ్చు వెంటాడిన దొరకని వైనం

ఏది ఏమైనా కోతుల అంతు చూసేందుకు కొండముచ్చును కొనుగోలు చేసిన మున్సిపల్ అధికారులు దాని బాగోగులు చూసే విషయంలో పూర్తిగా విఫలం కావడంతో అర్ధాకలితో అలమటిస్తూ ఆ కొండముచ్చు పారిపోయింది. ఇది ఇలా ఉండగా మున్సిపాలిటీలో కుక్కల బెడద అధికంగా ఉండగా ప్రత్యేక డ్రైవ్ ద్వారా కుక్కలను పట్టి ప్రత్యేక వాహనంలో పట్టిన కుక్కలను ఒంగోలు తరలించి సంతాన వృద్ధి కాకుండా ఆపరేషన్లను చేయించి వ్యాక్సిన్ మందు ఇచ్చి వాటిని తిరిగి ఎక్కడ పట్టారో అక్కడే వదిలేశారు. ఇలా ఒంగోలు వెళ్లి వచ్చిన కుక్కలు ఒంటినిండా పుండ్లతో బలహీనంగా తయారై రాకపోకలు సాగించే అనేక మంది పై దాడులు చేస్తున్నాయి. సంతాన ఉత్పత్తి జరగకుండా వేల రూపాయలు ఖర్చుపెట్టి కుక్కలకు శస్త్ర చికిత్సలు చేశారే కానీ, అవి కరవకుండా చేసేందుకు ప్రణాళికను రూపొందించలేకపోయారు. పట్టిన కుక్కలను నల్లమల అటవీ ప్రాంతంలో వదిలేస్తే బాగుండేదని పట్టణ ప్రజలు చెబుతున్నారు. ఇలా అనవసరంగా మున్సిపల్ నిధులను వృధా చేస్తున్నారని పుర ప్రజలు చర్చించుకోవడం గమనార్హం....!





## గిట్టుబాటు ధర తగ్గించడం పై రైతుల ఆందోళన

ఉండడంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ రోడ్డు పైకి వచ్చి ధర్నాకు దిగారు. రైతులు స్వచ్ఛందంగా రోడ్డుపై బైఠాయించి పొగాకు రైతులను ఆదుకోవాలని, వేలాన్ని తెచ్చిన బేళ్లను 90 శాతం కొనుగోలు చేయాలని, గిట్టుబాటు ధర పెంచాలని కోరుతూ రాస్తారోకో చేశారు. దీంతో ఒంగోలు - నంద్యాల రాష్ట్ర రహదారిపై ట్రాఫిక్ నిలిచిపోయింది. వెంటనే సమీపంలో ఉన్న పోలీస్ స్టేషన్ నుంచి ఏఎస్ఐ సత్యనారాయణ సంఘటన స్థలానికి చేరుకొని రైతులతో మాట్లాడారు. రోడ్డు పై ధర్నా చేసి చట్టాన్ని తమ చేతిల్లోకి తీసుకోవద్దని గిట్టుబాటు ధర కావాల్సి ఉంటే అధికారులతో మాట్లాడాలని పోలీసులు హెచ్చరించారు. తాము పలుమార్లు గిట్టుబాటు ధర విషయంలో పొగాకు బోర్డు అధికారులకు, రాజకీయ నాయకులకు చెప్పినా ఎటువంటి ఉపయోగం లేకపోగా కొనుగోళ్లు పొగాకు అమ్ముడు పోకపోగా తాము ఆత్మహత్య చేసుకోవడం తప్ప గత్యంతరం లేదని రైతులు హెచ్చరించడంతో వారిని సముదాయించిన ఏఎస్ఐ రైతులతో కలిసి పొగాకు వేలం కేంద్రం నిర్వహణ అధికారి దగ్గరికి వెళ్లారు. రైతుల పొగాకు సమస్యను పరిష్కరించి వారికి న్యాయం చేయాలని, మీ నిర్లక్ష్యంతో రైతులు రోడ్డు మీదకు రావడం బాగాలేదని సూచించారు. ఈ సందర్భంగా వేలం నిర్వహణ అధికారి రాజగోపాల్ రైతులకు సమస్య పరిష్కారం చేస్తామని, రీజనల్ మేనేజర్ పొదిలికి వస్తున్నారని ఈ విషయం ఆయన దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

# కృష్ణారావుకు శుభాకాంక్షలు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 7)
ద్రావిడ దేశం కృష్ణారావు నూతన గృహప్రవేశ కార్యక్రమంలో ఒంగోలులో గురువారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా నూతన గృహంలో నిర్వహించిన సత్యనారాయణ స్వామి వ్రత కార్యక్రమంలో కనిగిరికి చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ పెరుగు మురళీకృష్ణ హాజరై కృష్ణారావు దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఉడతల సురేంద్రనాథ్, మోటుపల్లి సురేష్, మీసాల శ్రీనివాస్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ కాలనీలో సూర్యఘర్ పథకం ప్రారంభం


(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, మే 7)
మండలంలోని వెల్లటూరు గ్రామ పంచాయితీలోని ఎస్సీ కాలనీలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన సూర్యఘర్ ఇంటింటికి సోలార్ పథకంలో భాగంగా రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి, రాష్ట్ర మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య ఆదేశాల ప్రకారం వెల్లటూరు ఎస్సీ కాలనీలో గురువారం ఈ పథకాన్ని ప్రారంభించడం జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా ముప్పాళ్ళ పిఏసిఎస్ చైర్మన్ మన్నెం రమణయ్య హాజరై వారి చేతుల మీదుగా దీన్ని ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వెల్లటూరు టిడిపి అధ్యక్షుడు జజ్జరపు బ్రహ్మయ్య, డీలర్ దొండేటి మధుసూదనరావు, మాజీ ఫీల్డ్ అసిస్టెంట్ ఎలికా మాలకొండయ్య, టిడిపి నాయకులు సోమేపల్లి మాల్యాద్రి, సోమేపల్లి రవి, బక్క ముంతల చంద్రయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ పెరికే మాధవరావు, కొప్పోలు సురేష్ బాబు, నల్లెపోగు చినకోటేసు, గోచిపాతల బాలరాజు, ఎన్ చిన బాలయ్య, అనేక మంది నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.



## బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు

### పొదిలి సిఐ రాజేష్ కుమార్ హెచ్చరిక
### పలు ప్రాంతాలలో దాడులు
### మద్యంబాబుల చే క్లీనింగ్





(షణ్ముఖ వెలుగు, పొదిలి, మే 7)
పొదిలి పట్టణంలోని పలు ప్రాంతాల్లో బహిరంగంగా మద్యం సేవిస్తు పట్టుబడిన వారిచే ఆ ప్రాంతాలను వారిచేతే శుభ్రం చేయించారు పొదిలి పోలీసులు. గురువారం పొదిలి సిఐ రాజేష్ కుమార్ ఆదేశాలతో పట్టణంలో బహిరంగ ప్రదేశాల్లో విస్తృత తనిఖీలు చేపట్టారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి ఇష్టం వచ్చినట్లు అపరిశుభ్ర వాతవరణం కల్పిస్తున్న మందుబాబులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. చట్టరిత్యా బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించటం నేరమని తెలిపారు. పట్టణంలోని పలు ప్రాంతాలలో బహిరంగంగా మద్యం సేవిస్తున్న వారిని స్టేషన్‌కు తరలించి వారికి ప్రత్యేక కౌన్సిలింగ్ ఇచ్చారు. ఇక పై బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తు పట్టుపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పొదిలి ఎ ఎస్ఐ సత్యనారాయణ, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# తెలుగు జాతి ఆత్మగౌరవం, తెగువకు చిరస్మరణీయ ప్రతీక అల్లూరి

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 7)

స్వాతంత్ర్య సమరయోధుడు, విప్లవ వీరుడు, అగ్గి పిడుగు అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా గురువారం జిల్లా పోలీస్ క్యాంపు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ తెలుగు జాతి ఆత్మగౌరవం, తెగువకు చిరస్మరణీయ ప్రతీకగా మన్యం వీరుడు అల్లూరి సీతారామ రాజు పోరాటం నిలిచిందని తెలిపారు. బ్రిటిష్ పాలకుల గుండెల్లో సింహస్వప్నంగా మారిన విప్లవ వీరుడు అల్లూరి సీతారామ రాజు పోరాట పటిమను కొనియాడారు. బ్రిటిష్ పాలకుల నిరంకుశ విధానాల వల్ల మన్యం ప్రజలు ఎదుర్కొంటున్న దీనస్థితిగతులను గుర్తించి, వారిలో చైతన్యం నింపి విప్లవానికి నాంది పలికిన మహనీయుడు అల్లూరి సీతారామ రాజు అని పేర్కొన్నారు. మన్యం ప్రజల హక్కులు, దేశ స్వాతంత్ర్యం కోసం అహర్నిశలు పోరాడి, కేవలం 27 ఏళ్ల వయసులోనే ప్రాణత్యాగం చేసిన విప్లవ జ్యోతిగా ఆయన నిలిచారన్నారు. ఆయన సాగించిన సాయుధ పోరాటం భారత స్వాతంత్ర్య చరిత్రలో చిరస్థాయిగా నిలిచే ప్రత్యేక అధ్యాయమని కొనియాడారు. సీతారామరాజు సాగించిన సాయుధ పోరాటం తెలుగు జాతి చరిత్రలో గొప్ప ఘట్టంగా చిరస్థాయిగా నిలిచి ఉంటుందని, తెలుగు జాతి తెగువకు నిలువెత్తు నిదర్శనమని, ఆయన త్యాగశీలిని, పోరాటపటిమను స్ఫూర్తిగా తీసుకొని నేటి యువత సమాజాభివృద్ధి కోసం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సీతారామిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



# సంజీవయ్య జిల్లాగా కర్నూలు జిల్లా పేరు మార్చాలి

## దామోదరం 54వ వర్ధంతి కార్యక్రమంలో దళిత నేత నీలం

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 7)

భారతదేశ తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జన్మించిన కర్నూలు జిల్లాకు సంజీవయ్య పేరు పెట్టాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేంద్రరావు డిమాండ్ చేశారు. గురువారం ఆంధ్ర ప్రదేశ్ దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య వర్ధంతి కార్యక్రమం పివి రావు మాల మహానాడు ఆధ్వర్యంలో ఒంగోలులో జరిగినది. సంజీవయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన అనంతరం. నీలం నాగేంద్రరావు మాట్లాడుతూ కర్నూలు జిల్లా పాములపాడు గ్రామానికి చెందిన దామోదరం సంజీవయ్య ముఖ్యమంత్రిగా పరిపాలన చేసి 1972 మే 7 తేదీన మరణించారన్నారు. 1952 లో తొలిసారి ఏమ్మెల్యే అయిన దగ్గర నుండి ముఖ్యమంత్రి అయ్యేవరకు మంత్రిగా పనిచేసిన ఘనత దామోదరం సంజీవయ్యదే నన్నారు. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రెండవ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య ఆనాటి కాంగ్రెస్ రెడ్ల గ్రూపు రాజకీయాల మధ్య రాజీనామా చేశారన్నారు. అసెంబ్లీ సమావేశాలకు ముఖ్యమంత్రిగా రిక్షాలో వచ్చిన ఘనత దామోదరం సంజీవయ్య అని అన్నారు. దామోదరం సంజీవయ్య 6, ఆరు లక్షల ప్రభుత్వ భూములు పేదలకు పంచారన్నారు. ఆంధ్ర దేశ చరిత్రలో వృద్ధాప్య పెన్షన్లు ప్రవేశపెట్టిన ఘనత కూడా సంజీవయ్య దేనన్నారు. రిజిస్ట్రేషన్లు జరిగేటప్పుడు మాల మాదిగలను సుబ్బిగాడు, కోటిగాడు అంటూ డాక్యుమెంట్లలో రాసే విధానాన్ని నిషేధించి సుబ్బారావు కోటేశ్వరరావు అంటూ లకు గౌరవ స్థానాన్ని కల్పించిన దళిత ఆత్మగౌరవ పతాకం దామోదరం సంజీవయ్యదేనన్నారు. అలాగే నీతి నిజాయితీలకు నిలువుటద్దం అయినా దామోదరం సంజీవయ్యను ఆంధ్రప్రదేశ్ ఆంధ్రప్రదేశ్ రెడ్డి కాంగ్రెస్ రెడ్డి గ్రూపులు పదవి నుండి తొలగిస్తే ఆనాటి భారత దేశ ప్రధాని నెహ్రూ దామోదరం సంజీవయ్యను కేంద్రమంత్రిగా తీసుకున్నారన్నారు. అలాగే దళితుడైన దామోదరం సంజీవయ్యను అఖిలభారత కాంగ్రెస్ పార్టీకి అధ్యక్షుడిగా నియమించారన్నారు. హైదరాబాదులో ట్యాంక్ బండ్ పక్కన సంజీవయ్య సమాధిని ఏర్పాటు చేసి దానినే సంజీవయ్య పార్కుగా అభివృద్ధి చేశారన్నారు. అవినీతి అక్రమాల కేసులు జైలు జీవితాలు గడిపిన మాజీ ముఖ్యమంత్రి జగన్ ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు లు దళిత ముఖ్యమంత్రి అవినీతికి ఆస్కారం లేని సుపరిపాలన అందించిన దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య పాలనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. సనాతన సనాతన పవర్ స్టార్ ఆంధ్ర చేగువీరా పవన్ కళ్యాణ్ ఐదేళ్ల క్రితం దామోదరం సంజీవయ్య నివాసాన్ని దామోదరం సంజీవయ్య మెమోరియల్ హౌస్ గా మారుస్తానని ఉత్తర కుమార ప్రగల్ బాలు పలికేరే కానీ అధికారంలోకి వచ్చిన తరువాత దామోదరం సంజీవయ్యను మర్చిపోయారన్నారు. 44 వేళ్ళ క్రితం అప్పుడు కాంగ్రెస్ ముఖ్యమంత్రి భవనం వెంకటరామిరెడ్డి కర్నూలు జిల్లాకు దామోదరం సంజీవయ్య పేరు పెడతామని ప్రకటించిన అమలు చేయలేదన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి చనిపోతే కడప జిల్లాను వైయస్సార్ కడప జిల్లాగాను, కృష్ణాజిల్లాకు దివంగత ముఖ్యమంత్రి చీ రామారావు పేరుతో ఎన్టీఆర్ కృష్ణ జిల్లా గాను వైయస్సార్ పార్టీ ముఖ్యమంత్రి జగన్ పేరు మార్చారన్నారు. కావున ఇప్పటికైనా కర్నూలు జిల్లాకు దామోదరం సంజీవయ్య పేరు పెట్టాలని కూటమి ప్రభుత్వాన్ని నీలం నాగేంద్ర డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షులు దారా అంజయ్య, కార్యదర్శి కాకమాను రవి, ఏడుకొండ మురళి, దేవరపల్లి గోపి, తదితరులున్నారు.



# ఎమ్మెల్యే ఏలూరి కృషితో అర్చకులకు ప్రభుత్వ భృతి

## ఆలయాలకు నెలకు రూ.10 వేల చొప్పున మంజూరు

(షణ్ముఖ వెలుగు, పర్చూరు, మే 7)

పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు కృషితో నియోజకవర్గంలోని పలు చిన్న దేవాలయాల్లో సేవలందిస్తున్న అర్చకులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త తెలిపింది. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న అర్చకులకు ప్రతినెల భృతి అందించేలా దేవాదాయ ధర్మాదాయ శాఖ చర్యలు చేపట్టింది. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రత్యేక సిఫార్సుతో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. పర్చూరు నియోజకవర్గ పరిధిలోని ఇటీవల 3 ఆలయాలకు ధూపదీప నైవేద్య పథకం కింద భృతి మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. ప్రతి ఆలయానికి నెలకు రూ.10 వేల చొప్పున ప్రభుత్వం అందించనుండగా, ఇందులో రూ.7 వేల గౌరవ వేతనం, రూ.3 వేల నైవేద్య ఖర్చుల కోసం కేటాయించినట్లు వెల్లడించారు. చిన్న ఆలయాల్లో సేవలందిస్తున్న అర్చకులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఎమ్మెల్యే ఏలూరి ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వినతికి స్పందించిన ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టి భృతి మంజూరు చేయడం పట్ల అర్చకులు, భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో దేవాలయాల పరిరక్షణతో పాటు నిత్యపూజలు నిరంతరంగా కొనసాగేందుకు ఈ పథకం ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ప్రభుత్వం దేవాలయాల అభివృద్ధి, అర్చకుల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని ఆయన పేర్కొన్నారు. ఇటీవల 7 దేవాలయాలకు ఈ స్కీమ్ మంజూరు కాగా తాజాగా మరో మూడు దేవాలయాలకు చోటు లభించింది. వాటిలో బొబ్బేపల్లి శ్రీ లక్ష్మీ పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం, మార్టూరు శ్రీ సీతా కోదండరామ స్వామి దేవస్థానం, పోలూరు శ్రీ దత్తాత్రేయ స్వామి వారి దేవస్థానంలు ఉన్నాయి.

# మహిళా భద్రత, సామాజిక అంశాల పై అవగాహన సదస్సు




(షణ్ముఖ వెలుగు, ఇంకొల్లు, మే 7)

బాపట్ల జిల్లా ఎస్పీ బి ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు చీరాల డిఎస్పి ఎండి మోయిన్ సూచనలతో మహిళలు, బాలికల రక్షణే ధ్యేయంగా ఇంకొల్లు పోలీసు స్టేషన్ పరిధిలోని రోటరీ క్లబ్‌లో చీరాల శక్తి బృందం ఆధ్వర్యంలో గురువారం భారీ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇంకోల్లు సిఐ రామ్ నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ మహిళల రక్షణ కోసం రూపొందించిన శక్తి యాప్ ప్రాముఖ్యతను వివరించారు. ప్రతి మహిళా తమ మొబైల్‌లో ఈ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలని, ఆపద సమయంలో ఇది తక్షణ రక్షణ కవచంలా పనిచేస్తుందని అవగాహన కల్పించారు. సదస్సులో భాగంగా అత్యవసర సమయాల్లో సంప్రదించవలసిన కీలక నెంబర్లైన 112 (పోలీస్), 181, 1091 (మహిళా హెల్ప్‌లైన్), 1098 (చైల్డ్ హెల్ప్‌లైన్) గురించి వివరించారు. అలాగే సైబర్ నేరాల బారిన పడకుండా 1930 నెంబర్‌ను, మాదకద్రవ్యాల నివారణకు 1972 టోల్ ఫ్రీ నెంబర్‌ను ఉపయోగించుకోవాలని సూచించారు. పోక్సో (గూజూూ) చట్టంపై అవగాహన కల్పిస్తూనే, బాల్య వివాహాల వల్ల కలిగే దుష్పరిణామాలను గురించి వివరించారు. రోడ్డు భద్రతపై 'శిరోరక్ష-ప్రాణరక్ష' కార్యక్రమంలో భాగంగా వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలను పాటించడం ద్వారా తమ ప్రాణాలను కాపాడుకోవాలని తెలిపారు. మహిళలు మరియు విద్యార్థినులు ఎటువంటి భయం లేకుండా తమ సమస్యలను పోలీసులకు తెలియజేయాలని, సమాజంలో చైతన్యం వచ్చినప్పుడే నేరాలు తగ్గుతాయని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఇంకొల్లు సీఐ రామ్ నాయక్, ఎస్ఐ సురేష్, సిబ్బందితో పాటు ఐసిడిఎస్ ప్రతినిధులు, గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులు పాల్గొన్నారు.

# గురజాల జగన్మోహన్‌ని సత్కరించిన మండవ మురళీకృష్ణ, పోతినేని శ్రీనివాసరావు







(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 7)

ఒంగోలులోని మండవ మురళీకృష్ణ నివాసానికి గురువారం చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ వచ్చారు. ఈ సందర్భంగా ఆయనను పారిశ్రామికవేత్త, కమ్మవారి సేవా సంఘం జిల్లా అధ్యక్షులు మండవ మురళీకృష్ణ, మండవ సుబ్బారావు, పోతినేని శ్రీనివాసరావు (పి.యస్.ఆర్), బొడ్డపాటి వెంకట్‌లు శాలువాతో సత్కరించారు.

# ఘనంగా దాచూరి రామిరెడ్డి వర్ధంతి





**(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, మే 7)**
ఉపాధ్యాయ ఉద్యమ నిర్మాత యుటిఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు దాచూరి రామిరెడ్డి వర్ధంతి కార్యక్రమం యూటీఎఫ్ కనిగిరి డివిజన్ కార్యాలయంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి టి రమణారెడ్డి అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు షేక్ ఖాజా రహంతుల్లా ఉపాధ్యాయ సమస్యల పై, విద్యారంగ పరిరక్షణకు కృషి చేసిన మహానుభావుడు దాచూరి రామిరెడ్డి అని అన్నారు. ఉపాధ్యాయ వృత్తికి వన్నెతెచ్చిన మహామేధావి రామిరెడ్డి అని యుటిఎఫ్ కుటుంబ సంక్షేమ డైరెక్టర్ బి రుసేంద్ర కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ షేక్ జిలాని, సాంస్కృతి కమిటీ కన్వీనర్ జెడ్ రమణయ్య, సీనియర్ నాయకులు వి మాలకొండారెడ్డి, ఖాజా హుస్సేన్, రమేష్ బాబు, కనిగిరి అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం కోటిరెడ్డి, పి నరసింహం, కోశాధికారి కేవి బాలకృష్ణరావు, షేక్ ఖాసిం షరీఫ్, షేక్ ఖాజా నాయిబ్ రసూల్, ఆర్ కాశయ్య, మురళీధర్‌రావు, డి వెంకటేశ్వర్లు, ఎస్ వెంకటేశ్వర్‌రెడ్డి, పూజల తిరుపయ్య, కె వి రామారావు, టివి సుబ్బారెడ్డి, మండలాల కార్యకర్తలు పాల్గొన్నారు.

# వాహనాలకు ఫిట్నెస్ సర్టిఫికేట్, ఇతర అవసరమైన పత్రాలు నవీకరించుకోవాలి



**షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 7)**
జిల్లాలో 744 స్కూళ్ళు, కాలేజీ యాజమాన్యాలకు ఉప రవాణా కమీషనర్ ఆర్ సుశీల వారి ఆదేశాల మేరకు 63 నిబంధనల ప్రకారం ఉండేలా తక్షణ చర్యలు తీసుకోవలసిందిగా కోరారు. అందులో భాగంగా స్కూల్ బస్సు యాజమాన్యాలు పలు సూచనలు తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. వాహనాలకు ఫిట్నెస్ సర్టిఫికేట్, ఇతర అవసరమైన పత్రాలను నవీకరించుకోవాలన్నారు. సంబంధిత రికార్డులను పూర్తి స్థాయిలో సరిచేసి నిర్వహించాలన్నారు. ఏఐఎస్ 63 నిబంధనల ప్రకారం స్కూల్ బస్సులన్నీ ఎఫ్‌డిఎస్ఎస్, ఎఫ్ఏఎస్, ఎఫ్‌పిఎస్, ఎఫ్ఏబి, అత్యవసర ద్వారము, అత్యవసర కిటికీలు అన్ని కిటికీలకు హారిజంటల్ రైలింగ్స్, వీఎల్‌టీడీ స్పీడ్ లిమిట్ జిపిఎస్ సిస్టం, ప్యానిక్ బటన్స్ తదితర భద్రత పరికరాలను అమర్చుకోవాలన్నారు. హెవీ లైసెన్స్ కలిగి అయిదు సంవత్సరముల అనుభవం కలిగి 60 సంవత్సరముల లోపల వున్న వ్యక్తులను డ్రైవర్‌లుగా నియమించాలన్నారు. ఫిట్నెస్ సర్టిఫికెట్ ఏటిఎస్ వద్ద నుండి పొందిన తర్వాత ప్రతి బస్సును ఉప రవాణా కమిషనర్ వారి కార్యాలయం, ఒంగోలు, దర్శి, కందుకూరు నందు వాహన తనిఖీ అధికారుల ఎదుట హాజరు పరిచి స్కూల్, కాలేజీ బస్సులు ఏఐఎస్ 63 నిబంధనలు అన్ని కూడా అమర్చి ఉన్నాయా లేదా అని పరిశీలించుటకు హాజరుపరచాలన్నారు. ఇప్పటి వరకు గత నెల 28వ తేదీ నుండి 6.6.2026 వరకు 22 స్కూల్, కాలేజి యాజమాన్యాల 148 స్కూల్, కాలేజి బస్సులను ఏఐఎస్ 63 నార్మ్స్ ప్రకారం తనిఖీలు చేయడం జరిగిందన్నారు. 148 వెహికల్స్ ఏఐఎస్ 63-63 నార్మ్స్ అన్ని తనిఖీ చేయగా అందులో 100 బస్సులకు ఏఐఎస్-63 నిబంధనల ప్రకారం ఉన్నాయి. 48 బస్సులను తిరిగి ఏఐఎస్-63 నిభందనల ప్రకారం సరి చేసుకోవలసిందిగా కోరుతూ వెనక్కి తిప్పి పంపడం జరిగింది. ప్రతి రోజు స్కూల్, కాలేజి బస్సుల యాజమాన్యం వారి బస్సులకు ఫిట్నెస్ కొరకు ఎటిఎస్ సెంటర్ నందు ఫిట్నెస్ చేయించుకొని ఉప రవాణా కమీషనర్ వారి కార్యాలయం నందు మరల ఆ కాలేజీ బస్సులను వాహన తనిఖీ అధికారుల ఎదుట హాజారు పరచాలని కోరారు. నిబంధనలకు అనుగుణంగా లేని యెడల వాహనములు సీజ్ చేయడం జరుగుతుందన్నారు. కనుక ప్రతి స్కూల్, కాలేజీ బస్సుల యాజమాన్యం తప్పనిసరిగా నిబంధనలు పాటించి స్కూల్, కాలేజీ ప్రారంభించే లోగా నవీకరణ చేసుకోవలసిందిగా కోరారు.



# ఎమ్మెల్యే ఏలూరి కృషితో దేవాలయాల పునరుద్ధరణ

## నియోజకవర్గంలోని పలు ఆలయాలకు గ్రీన్ సిగ్నల్
## 10 దేవాలయాల అభివృద్ధికి రూ.8.40 కోట్లు
## ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
## దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వ ప్రాధాన్యం
## ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

**(షణ్ముఖ వెలుగు, పర్చూరు, మే 7)**
పర్చూరు నియోజకవర్గంలో ఆలయాలకు మహర్దశ పట్టింది. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రత్యేక కృషితో నియోజకవర్గంలోని 10 దేవాలయాల పునరుద్ధరణకు రూ.8.40 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఈ మేరకు దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు కు లేఖ రాశారు.పురాతన దేవాలయాల అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పన లక్ష్యంగా ఎమ్మెల్యే ఏలూరి ప్రభుత్వం దృష్టికి సమస్యలను తీసుకెళ్లగా ప్రభుత్వం సానుకూల స్పందించింది. పలు ఆలయాల పునరుద్ధరణకు గ్రామీణ ప్రాంతాల్లో ఆధ్యాత్మిక వాతావరణం మరింత బలోపేతం కావడంతో పాటు భక్తులకు సౌకర్యాలు మెరుగుపరచాలని లక్ష్యంతో ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ప్రభుత్వం దేవాలయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే ఏలూరి తెలిపారు. నియోజకవర్గ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు తీసుకురావడానికి కృషి కొనసాగిస్తానని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



**అభివృద్ధి చేయనున్న దేవాలయాలు...ఇలా**
యద్దనపూడి మండలం చింతపల్లిపాడు గ్రామంలో శ్రీ చెన్నకేశవస్వామి దేవాలయం రూ.50 లక్షలు, పర్చూరు మండలం ఇనగల్లు గ్రామంలో శ్రీ చెన్నకేశవ స్వామి దేవాలయం. రూ.1.50 కోట్లు, కారంచేడు మండలం కారంచేడు గ్రామంలో శ్రీ మాధవ స్వామి దేవాలయం రూ. 20 లక్షలు, ఇంకొల్లు మండలం పుసపాడు గ్రామంలో శ్రీ మల్లేశ్వరస్వామి దేవాలయం రూ.90 లక్షలు, మార్టూరు మండలం కోలలపూడి గ్రామంలో శ్రీ నీలకంఠేశ్వరస్వామి దేవాలయం రూ.60 లక్షలు, పర్చూరు మండలం చెన్నుభొట్లవారిపాలెం గ్రామంలో శ్రీ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం రూ.55 లక్షలు, మార్టూరు మండలం కోనంకి గ్రామంలో శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయం రూ.1.65 కోట్లు, మార్టూరు మండలం ఇసుక దర్శి గ్రామంలో శ్రీ సీతారామ స్వామి దేవాలయం రూ.1.20 కోట్లు, కారంచేడు మండలం దగ్గుబాడు గ్రామంలో శ్రీ సిద్ధేశ్వర, కనక నాగవరపమ్మ అమ్మవారి దేవాలయం రూ.85 లక్షలు, పర్చూరు మండలం చెరుకూరు గ్రామంలో శ్రీ త్రివిక్రమ, అగస్త్యేశ్వర స్వామి దేవాలయం రూ.45 లక్షలు.

# ఆంధ్ర సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో 4వ ప్రపంచ తెలుగు మహా సభలు

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 7)**
ఈ నెల 10వ తేదీన ఆంధ్ర సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో 4వ ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహిస్తున్నట్లు పరిషత్ సంచాలకులు పొన్నూరు వేంకట శ్రీనివాస్ గురువారం ఓ ప్రకనటలో తెలిపారు. ఈ సాహిత్య సదస్సును ఒంగోలులోని నెక్స్ట్ జన్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రాంగణంలో ఉదయం 9 గంటలకు ప్రారంభించనట్లు పరిషత్తు అధ్యక్షులు డాక్టర్ గజల్ శ్రీనివాస్, సమన్వయకర్తలు డాక్టర్ కే మురళీధర్‌రెడ్డి, కోగంటి శ్రీనివాస్, సంచాలకులు పొన్నూరు వేంకట శ్రీనివాస్‌లు తెలిపారు. ఈ సదస్సులో ప్రఖ్యాత కవులు, సాహితీ మూర్తులు పాల్గొని, ప్రకాశం జిల్లా తెలుగు వెలుగుల పై ప్రసంగిస్తారని డాక్టర్ గజల్ శ్రీనివాస్ తెలిపారు. ఈ సదస్సులో డాక్టర్ నాగభైరవ కోటేశ్వరరావు - మూడమంచు వెంకటేశ్వర్లు, బి హనుమారెడ్డి - పాలూరి శివప్రసాద్, డాక్టర్ ధారా రామనాధశాస్త్రి - (పద్యకవి ఉపన్యాసకులు) - కప్పగంతుల మధుసూదన శాస్త్రి, మల్లవరపు జాన్ (పద్యకవి) - డాక్టర్ నూకతోటి రవికుమార్, ఈమని దయానంద (అభ్యుదయ కవి) - డాక్టర్ సంతవేలూరి కోటేశ్వరరావు, భానుమతి రామకృష్ణ (కథా రచయిత్రి) - అన్ను విజయకుమారి, మహాస్వప్న (దిగంబర కవి) - ఎస్.ఎం.డి.రఫి, ఎర్రనామాత్యుడు (ప్రబంధ కవి) - గాడేపల్లి దివావకరదత్తు,
వేటపాలెం సారస్వత నికేతన్ (గ్రంథాలయం) - కాంతి నల్లూరి, ప్రకాశం జిల్లా సాహిత్యరంగం - డాక్టర్ నూనె అంకమరావు,
ప్రకాశం జిల్లా కళారంగం - అంగలకుర్తి ప్రసాద్, ప్రకాశం జిల్లా అవధాన రంగం - అష్టావధాని నారాయణం బాలసుబ్రహ్మణ్యం,
ప్రకాశం జిల్లా నాటకరంగం - పిన్ని వెంకటేశ్వర్లు, ప్రకాశం జిల్లా జానపద రంగం - విద్వాన్ జ్యోతి చంద్రమౌళి, ప్రకాశం జిల్లా రచయిత్రులు - పి రాజ్యలక్ష్మి, కొలకలూరి స్వరూపరాణి (తొలితెలుగు స్త్రీవాద కవయిత్రి) - టి అరుణ, త్యాగరాజస్వామి (సంగీతం) - బీనీడి కృష్ణయ్య, శ్యామశాస్త్రి (సంగీతం) - నెమ్మాని సీతారామమూర్తి, ఎం ఎస్ బాలసుబ్రహ్మణ్య శర్మ (సంగీతం) - ఐ మురళీకృష్ణ, రాయప్రోలు సుబ్బారావు (భావ కవి) - ఎస్‌కెవి ప్రసాద్, ఎంవిఎస్ హరనాధరావు (నాటక రచయిత) - యు.వి రత్నం, తరువోజ పద్యశాసనం (అద్దంకి) - పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, టి కృష్ణ (సినీదర్శకులు) - సయ్యద్ ఇస్మాయిల్, ఎంవిఎస్ శర్మ (కవి, రచయిత) - ఎంవిఎస్ శాస్త్రి, కందుకూరి రుద్రకవి (జనార్ధనాష్టకం) - గణపతిరాజు వెంకట మాల్యాద్రి, నాయని సుబ్బారావు (భావకవి) - అనఘా ఝాన్సీ సుబ్బారావు పాల్గొని ప్రసంగిస్తారన్నారు. కనుక జిల్లాలోని కవులు, రచయితలు, భాషాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని విశిష్ట సాహిత్య సదస్సుని విజయవంతం చేయవలసిందిగా గజల్ శ్రీనివాస్ కోరారు.

# 100 మంది మత్స్యకారులకు వలల పంపిణీ

## పంపిణీ చేసిన పిడి సింగయ్య ముఖ్యమంత్రి చంద్రబాబు మహిళ పక్షపాతి

**(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, మే 7)**

ముఖ్యమంత్రి చంద్రబాబు మహిళ పక్షపాతి అని పర్చూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఏలూరి సంబశివరావు చోరవతో రాష్ట్రంలోనే అత్యధిక నీధులను తిసుకోచ్చి వేల కుటుంబల్లో వెలుగులు నింపుతున్నాడని మండల తెదేపా అధ్యక్షుడు పోద వీరయ్య చౌదరి కోనియాడారు. గురువారం మండలంలోని వెలుగు కార్యాలయ ప్రగణంలో వెలుగు డిఆర్డి ఆధ్వర్యంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు శారదమ్మ అధ్యక్షతన ఎపిఎమ్ సుబ్బారావు పర్యవేక్షణలో వందమంది మత్స్యకారులకు వలల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమనికి ప్రాజెక్ట్ డైరెక్టర్ బి సింగయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పిడి సింగయ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో ఐదు లక్షల మందిని లక్షాధికారులు చేయాలని అటువంటి లక్ష్యంతోటి 100 మంది మత్స్యకారులకు కోటి రూపాయలు విలువ చేసేటటువంటి వలలు పంపిణీ చేయటం చాలా సంతోషకరంగా ఉందన్నారు. ఈ కోటి రూపాయలు సిఐఎఫ్ శ్రీనిధి సహకారంతో ఇవ్వడం జరిగింది దీని ద్వారా ఈ 100 మంది కుటుంబాలకు వారి యొక్క జీవనోపాధి మెరుగుపరచుకోవడానికి ఇది ఎంతో ఉపయోగకరం అని అన్నారు. అలాగే పీఎం అజయ్ పథకం కింద ఐదు మందికి ఆటోలు కూడా ఇవ్వటం జరిగిందన్నారు. ఈ పథకంలో యూనిట్ కాస్ట్ 3లక్షల ఎనిమిది వేల రూపాయలను అందులో రూ.50 వేల రూపాయలు సబ్సిడీ బెనిఫిషియల్ కాంట్రిబ్యూషన్ ఫోను మిగిలిన 2,20,000 రూపాయలు వడ్డీ లేకుండా కట్టాలన్నారు. ఎపిఎం సుబ్బారావు అధ్వర్యంలో మండలంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను సక్రమంగా ఉపయోగించుకుంటున్నారు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నరహరి శీనివాసరావు, వడ్లముడి సత్యం, సందు శీను, మొటుమర్రి రామ సుబ్బారావు, సాంబయ్య, శీను సీసీలు వెంకటస్వామి, మాధవి, శ్రీలక్ష్మి, వివోఏలు పాల్గొన్నారు.







# రాష్ట్రస్థాయి ఒంగోలు జాతి వృషభరాజుల బలప్రదర్శన



**(షణ్ముఖ వెలుగు, మద్దిపాడు, మే 7)**

మద్దిపాడు మండలం తెల్లబాడు, దొడ్డవరం గ్రామాల నందు శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి ఆరాధన మహోత్సవం సందర్భంగా స్వర్గీయ మల్లిపెద్ది రామకృష్ణ జ్ఞాపకార్థం రాష్ట్రస్థాయి ఒంగోలు జాతి వృషభరాజుల బలప్రదర్శన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మారిటైమ్ బోర్డు చైర్మన్, జోనల్ కోఆర్డినేటర్ దామచర్ల సత్య, చీరాల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య, మాజీ ఎమ్మెల్యే గరటయ్య, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి అడకా స్వాములు, మద్దిపాడు మండల అధ్యక్షులు ఉప్పుగుండూరు నాగేశ్వరరావు, టిడిపి సీనియర్ నాయకులు పోతినేని శ్రీనివాసరావు (పియస్ఆర్), మార్నేని రాఘవ, గట్టినేని అయ్యన్న, మదనపల్లి శ్రీనివాసరావు, టి అనంతమ్మ, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.











## ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 102వ వర్ధంతి



**(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, మే 7)**

ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గురువారం మాచర్ల పట్టణంలోని పెన్షనర్ అసోసియేషన్ భవనం నందు మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 102వ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో మొదటగా అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా పల్నాడు జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్ మరియు దళిత బహుజన సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కుక్కమూడి ప్రసాద్, దళిత బహుజన భీమ్సేన రాష్ట్ర అధ్యక్షులు పేరుపోగు జార్జి, ఏపీ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్ట్ వెల్ఫేర్ అవేర్నెస్ ఆర్గనేషన్ రాష్ట్ర అధ్యక్షులు గురజాల అప్పారావు మాట్లాడుతూ మన్యం వీరుడు, విప్లవ యోధుడు,స్వతంత్ర సమరయోధుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి కార్యక్రమాన్ని జరుపుకోవటం గర్వంగా ఉందని ఆయన 1897, జూలై 4న అల్లూరి సీతారామ జిల్లా భీమునిపట్నం పాణ్యం గ్రామంలో జన్మించారని, 1927 మే 7న మరణించడం జరిగిందని;ఆయన 27 సంవత్సరాలు వయసులోనే బ్రిటిష్ పాలకులను ఎదిరించి గిరిజన హక్కుల కోసం పోరాడిన వ్యక్తి అల్లూరి సీతారామరాజు అని యువత అల్లూరి సీతారామరాజును స్ఫూర్తిగా తీసుకోవాలని ఆయన చేసిన త్యాగాలను స్మరించుకోవటం జరిగింది. కార్యక్రమంలో సీనియర్ దళిత నాయకుడు కడియం అన్నారావు, సీనియర్ దళిత నాయకుడు దానియేలు, తదితరులు పాల్గొన్నారు.

## సెన్సస్ 2027 ఎన్యూమరేషన్ ప్రక్రియను పరిశీలించిన ఆర్డీవో



**(షణ్ముఖ వెలుగు, గోపవరం, మే 7)**

సెన్సస్ 2027 కార్యక్రమంలో భాగంగా బద్వేల్ మండలం బయనపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న ఎన్యూమరేషన్ ప్రక్రియను అధికారులు పరిశీలించారు. గ్రామంలోని హెచ్ఎల్బీ నంబర్ 29 పరిధిలో ఎన్యుమరేటర్ ఆకుల సుజాత సర్వే నిర్వహిస్తున్న సమయంలో బద్వేల్ రెవెన్యూ డివిజనల్ అధికారి ఏ చంద్రమోహన్, తహసీల్దార్ పీర్ మున్ని, ఎంపీడీవో రమణారెడ్డి కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు సర్వే విధానం, వివరాల నమోదు ప్రక్రియపై ఆరా తీసి సిబ్బందికి తగిన సూచనలు చేశారు.

## శింగరబోట్లపాలెం గ్రామంలో గ్రామసభ





**(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, మే 7)**

మండలంలోని శింగరబోట్లపాలెం గ్రామం యందు గురువారం గ్రామ సభ నిర్వహించారు. గ్రామ సభ యందు రెవెన్యూ సమస్యలు, గ్రామంలోని ఏ సమస్య ఉన్నా అర్జీ రూపంలో ఇస్తే పిజిఆర్ఎస్ నందు నమోదు చేసి నెల రోజులలో సమస్య పరిష్కారం చేయగలరని ఎంపిడిఒ సుజాత తెలిపారు. గ్రామసభకు హాజరైన వారు, ఆర్ఎస్డిటి నరసయ్య, విఆర్ఒ రేవంత్, మండల సర్వేయర్ గోపి సచివాలయం సిబ్బంది, గ్రామ నాయకులు గుండాల రమణారెడ్డి, కూరపాటి రాఘవరెడ్డి, పల్లపోతు మహేష్, మువ్వా రమణారెడ్డి, చల్లా శ్రీనివాసులురెడ్డి, గ్రామ ప్రజలు హాజరయ్యారు.

## పాత సింగర బొట్లపాలెంలో కిశోర వికాసం పై శిక్షణ



(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, మే 7)
మండలంలోని పాత సింగర బొట్లపాలెంలో గురువారం కిశోర వికాసం పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో డాక్టర్ పి సుజాత మాట్లాడుతూ 11 సంవత్సరాల నుంచి 18 సంవత్సరాలలోపు వయసు ఉన్న బాల బాలికలకు వేసవి సమ్మర్ క్యాంప్ ప్రణాళిక గురించి తెలిపారు. ఫోక్సో చట్టం గురించి బాల బాలికలు తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ రిజ్వాన ఎంఈఓలు రమణారెడ్డి, రాఘవరెడ్డి, సర్వేయర్, ఏఎస్ఓలు, ఏఎన్ఎంలు, అంగనవాడి కార్యకర్తలు కే రామలక్ష్మమ్మ, పి సుజాత, అరుణ, హైమావతి, గౌతమి, తదితరులు పాల్గొన్నారు

## భూ సమస్యల పరిష్కారం కై ఒక నెల..ఒక గ్రామం



(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, మే 7)
మండలంలోని రైతాంగం, భూ యజమానులు ఎదుర్కొంటున్న తీవ్రమైన భూ సమస్యల పరిష్కారంపై మండల రెవెన్యూ శాఖ అధ్వర్యంలో సగటున ఒక గ్రామంలో ఉన్న భూ సమస్యలను ఒక నెలలో పరిష్కరించేందుకు 'ఒక నెల, ఒక గ్రామం, నాలుగు దఫాలుగా గ్రామ సందర్శించి సమస్యలు గురించి అర్జీలు తీసుకొని పరిష్కారం చూపనున్నట్లు మండల తహశీల్దార్ జె.ప్రభాకరరావు తెలిపారు. శుక్రవారం మండలంలోని చింతగుంపల గ్రామంలో తహశీల్దార్ జె ప్రభాకరరావు అధ్వర్యంలో ఒక నెల, ఒక గ్రామం, నాలుగు దఫాలుగా గ్రామ సందర్శిన కార్యక్రమం నిర్వహించి 11 అర్జీలను స్వీకారించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జె ప్రభాకరరావు, మండల సర్వేయర్ లోకేష్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

## అనమనమూరులో పర్యటించిన జాయింట్ కలెక్టర్



(షణ్ముఖ వెలుగు, కొరిశపాడు, మే 7)
మండలంలోని అనమనమూరు గ్రామంలో గురువారం ఒక నెల -ఒక గ్రామం -నాలుగు సందర్శనల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కల్పనకుమారి పాల్గొని గ్రామంలో సమస్యలపై వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అర్జీలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆమె అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గ్రామంలో నాలుగు దశల్లో ఈ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. రెవిన్యూ సమస్యలను పరిష్కరించడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం అని కల్పనా కుమారి తెలియచేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలు సమస్యలను సర్పంచుల సంఘం అధ్యక్షులు జంపు హరిబాబు జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో జివి సుబ్బారెడ్డి, ఎండిఓ రాజ్యలక్ష్మి, వీఆర్వో యలమందరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఆధ్యాత్మిక యాత్రకు బయలుదేరిన బద్వేల్ ప్రముఖులు



(షణ్ముఖ వెలుగు, బద్వేల్, మే 7)
ంబద్వేల్‌లోని శ్రీమహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వెంకటేశ్వర స్వామి, అభయాంజనేయ స్వామి దేవాలయశీ పూజారి వీరేశ చార్యులు వివాహ మహోత్సవ వేడుకల్లో భాగంగా పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు, వ్యాపారస్తులు ఆధ్యాత్మిక యాత్రకు శ్రీకారం చుట్టారు. గురువారం బద్వేల్ నుండి ప్రత్యేక బస్సుల్లో ఈ యాత్ర ప్రారంభమైంది.

**ముక్కోటి దేవతల దర్శనం :**

యాత్రలో భాగంగా భక్తులు మొదటిగా అహోబిల క్షేత్రాన్ని సందర్శించి, అక్కడ కొలువై ఉన్న లక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం నంద్యాల జిల్లాలోని ప్రముఖ శైవ క్షేత్రమైన మహానందిని సందర్శించి, మహానందీశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడి నుండి నేరుగా తుంగభద్ర తీరాన వెలసిన మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి వారిని దర్శించుకునేందుకు యాత్రికులు బయలుదేరి వెళ్లారు. ఈ ఆధ్యాత్మిక జర్నీలో మార్కెట్ యార్డ్ డైరెక్టర్ కొలిశెట్టి నాగరాజా, మాజీ డైరెక్టర్ పబ్బతి చంద్రశేఖర్, సత్యనారాయణ, చక్రపాణి, వార్త జర్నలిస్ట్ రమణ, ప్రముఖ విద్యావేత్త సివి నాగేశ్వరరావు, రాయలసీమ స్కూల్ కరస్పాండెంట్ గొడిసిపాటి అంకయ్య, నిమ్మకాయల శివారెడ్డి, ముచ్చర్ల సుధాకర్‌రావు, ప్రవీణ్, భార్గవ్, వినోద్, సుదర్శన్, శ్రీనివాసులు, మాడ పూర్ వెంకటరమణ, చీదెళ్ల వెంకటరమణ, సురేంద్రలతో పాటు పెద్ద సంఖ్యలో మహిళలు మరియు భక్తులు పాల్గొన్నారు. పూజారి వీరేశాచార్యులు వివాహ వేడుకను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఈ యాత్ర ఎంతో భక్తిశ్రద్ధలతో సాగుతోందని యాత్రికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ముచ్చర్ల సుజాత, వల్లంకొండు ధనలక్ష్మి, గొడిసి పాటి రుక్మిణి, విజిత కుమారి, జయమ్మ, నాగరత్నమ్మ, పబ్బతి శ్రీదేవి, పబ్బతి సుదీప్తి, సాయి మణికంఠ రిషి, గొడ్లవిటి వెంకటయ్య, రాజమ్మ, వి లక్ష్మి రాధ, సౌజన్య, బుజ్జమ్మ, పలువురు మహిళలు పాల్గొన్నారు.





# రెవెన్యూ సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక చొరవ చూపాలి

## జిల్లా జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు




(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, మే 7)
మార్కాపురం జిల్లాలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని జాయింట్ కలెక్టర్ పి శ్రీనివాసులు ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ఒక నెల-ఒక గ్రామం-నాలుగు సందర్శనలు కార్యక్రమంలో భాగంగా గురువారం ఆయన గిద్దలూరు నియోజకవర్గంలోని కొమరోలు మండలం సూరవారిపల్లి, రాచర్ల మండలం అనుమలపల్లి, అర్ధవీడు మండలం బొల్లుపల్లి గ్రామాల్లో రెవెన్యూ అధికారులు నిర్వహిస్తున్న ప్రత్యేక కార్యక్రమాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీ సర్వే జరిగిన గ్రామాల్లో జాయింట్ ఎల్‌పీఎం సమస్యలను ఈ నెలాఖరు లోపు పరిష్కారం చేయాలన్నారు. సాదా, బైనమా, చేతిరాతలు ద్వారా రాసుకున్న వాటికి రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం ఉందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 206 గ్రామాలు రీసర్వే పూర్తి అయిందని వివరించారు. వీటిల్లో అందరికీ నూతన పాస్ పుస్తకాలు అందజేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాల్లో భూ సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారుల పై ఎంతైనా ఉందన్నారు. మార్కాపురం జిల్లాలో ఎక్కువగా ఉన్న భూ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల తహసిల్దార్లు, ఎంపీడీవోలు, ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.





On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com